


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 20.07.2026 | సంపుటి: 3 | సంచిక: 168 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 20.07.2026 | VOLUME : 3 | ISSUE : 168 | PAGES: 8 | COST: 2/- |


## గోల్కొండలో తొలి బోనంతో బోనాల మహోత్సవాలకు శ్రీకారం

- నెల రోజుల పాటు వైభవంగా సాగే తెలంగాణ ఆధ్యాత్మిక వేడుకలు
- గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం
- రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు
- బల్కంపేట, సికింద్రాబాద్, లాల్‌దర్వాజాలో తదుపరి ఉత్సవాలు
- ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు.. భారీ పోలీసు బందోబస్తు

3



# బండి-ఈటల సయోధ్య

# గ్రేటర్ కోసమేనా?

- జీహెచ్‌ఎంసీ ఎన్నికలపై కమలం ప్రత్యేక దృష్టి
- విభేదాలు వీడి కలిసికట్టుగా పనిచేయాలని అధిష్ఠానం స్పష్టమైన ఆదేశాలు
- కార్యకర్తలను ఏకం చేయడమే లక్ష్యం.. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యల సంకేతాలు

తెలంగాణ బీజేపీలో కేంద్రమంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మధ్య కొనసాగుతున్న విభేదాలకు తెరదించేందుకు పార్టీ అధిష్ఠానం చేపట్టిన ప్రయత్నాల వెనుక ప్రధాన లక్ష్యం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికలేనన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యంగా గ్రేటర్‌పై పట్టు సాధించాలంటే అంతర్గత విభేదాలకు ముగింపు పలకడం తప్పనిసరనే అభిప్రాయంతో ఢిల్లీ నాయకత్వం నేరుగా జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 19



2

## పదవుల కోసం గాంధీభవన్‌కు రావొద్దు

- సర్ ప్రక్రియపైనే పూర్తిగా దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ ఆదేశం
- ఆగస్టు 3 వరకు నియోజక వర్గాల్లోనే ఉండాలని సూచన
- హైదరాబాద్ చుట్టూ తిరిగితే సహించబోమని హెచ్చరిక
- బూత్ స్థాయి సమీక్షలను వేగవంతం చేయాలని ఆదేశం
- ఉత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీతో భేటీ అవకాశం

2





## నన్ను కోస్తావా కోయ్.. కానీ కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయ్

- రంగనాయకసాగర్ కోసం రైతుల పాదయాత్రలో హరీష్ రావు
- "నా రక్తం తీసుకో.. రైతులకు నీళ్లు ఇవ్వు" అంటూ సీఎం రేవంత్‌కు సవాల్
- కాళేశ్వరం నుంచి నీటి పంపింగ్ నిలిపివేసి కృత్రిమ కరువు సృష్టించారని ఆరోపణ
- రైతుల కోసం వెంటనే నీటి విడుదల చేపట్టాలని డిమాండ్

3



## సాగునీటి సంస్థలకు ఆర్థిక బలోపేతం

- 10 రోజుల్లో సమగ్ర ఫండింగ్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఉత్తమ్ ఆదేశం
- రుణభారం తగ్గింపుపై ప్రత్యేక కార్యాచరణ
- సౌర విద్యుత్ ప్రాజెక్టులతో ఆదాయ వనరుల విస్తరణ
- అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు
- రైతుల పరిహారం చెల్లింపుల్లో జాప్యం వద్దని స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 19 :

తెలంగాణలోని సాగునీటి సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. హైదరాబాద్‌లోని కుందన్‌బాగ్‌లో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సంస్థల ఆర్థిక పరిస్థితి, రుణభారం తగ్గింపు, నిధుల సమీకరణ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. రాబోయే పది రోజుల్లో సాగునీటి సంస్థల

మిగతా 2వ పేజీలో..

## పుష్కరాల నాటికి భద్రాద్రి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- ఆలయ అభివృద్ధికి రూ.351 కోట్లతో పనులు
- భూసేకరణ కోసం ఇప్పటికే రూ.75 కోట్ల వ్యయం
- పుష్కరాలకు 15 రోజుల ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశం
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచన

3



## "అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకూడదు"

- ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశం
- ఆగస్టు 3 వరకు ఎస్ఐఆర్‌పైనే పూర్తి దృష్టి
- బూత్ స్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచన
- నియోజకవర్గాల్లోనే ఉండి ఓటర్లకు సహకరించాలని పిలుపు
- ఎన్నికల ప్రచారం తరహాలో పనిచేయాలని నేతలకు సూచన



4

## శేఖర్ సృజన తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి

- శేఖర్ మెమోరియల్ అవార్డుల ప్రదానోత్సవంలో కేటీఆర్
- కళాకారులను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత
- కార్టూనిస్ట్ ఎం. నారు, చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్‌కు అవార్డులు
- వచ్చే ఏడాది నుంచి మరింత ఘనంగా అవార్డుల నిర్వహణకు సహకారం కళా, సాహిత్య రంగాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపు

2



## సూపర్ ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

- రైతులు, ప్రజల రక్షణకు మిషన్ మోడ్‌లో పనిచేయాలని మంత్రి తుమ్మల ఆదేశం
- రిజర్వాయర్ల నుంచి సాగునీటి విడుదలకు అనుకూల పరిస్థితులు లేవు
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచన
- తాగునీటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశం

2



## సింగరేణి చుట్టూ రాజకీయాల వేడి..!


- సింగరేణిపై నేతల క్యూ.. ఉద్యోగాలపై నో క్లారిటీ!..
- పర్యటనలు జోరు.. యువతకు ఉద్యోగాలు ఎప్పుడు?..
- కార్మికుల ప్రేమా.. రాజకీయ ప్రచారమా?..
- హామీలు కాదు.. నియామకాలే కావాలంటున్న యువత..

4



# సాగునీటి సంస్థలకు ఆర్థిక బలోపేతం

మొదటిపేజీ తరవాయి



ఆర్థిక బలోపేతానికి సమగ్ర ఫండింగ్ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రభుత్వ బడ్జెట్‌పైనే పూర్తిగా ఆధారపడకుండా సాగునీటి సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇందులో భాగంగా సాగునీటి శాఖకు చెందిన ఖాళీ భూముల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. అయితే ఈ చర్యల వల్ల రైతులపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న చట్టబద్ధ ఆడిట్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

గతంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం తీసుకున్న అధిక వడ్డీ రుణాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన రుణాలు, అందుబాటులో ఉన్న నిధులు, పనుల పురోగతిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. తక్కువ వ్యయంతో వేగంగా పూర్తయ్యే, రైతులకు త్వరగా సాగునీరు అందించే ప్రాజెక్టులకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. సాగునీటి శాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల వివరాలను రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల్లోగా సేకరించి నివేదిక అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు రావాల్సిన పరిహారాన్ని సకాలంలో చెల్లించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నారు.

# బండి–ఈటల సయోధ్య గ్రేటర్ కోసమేనా?

**న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 19 :**



తెలంగాణ బీజేపీలో కేంద్రమంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మధ్య కొనసాగుతున్న విభేదాలకు తెరదించేందుకు పార్టీ అధిష్ఠానం చేపట్టిన ప్రయత్నాల వెనుక ప్రధాన లక్ష్యం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికలేనన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యంగా గ్రేటర్‌పై పట్టు సాధించాలంటే అంతర్గత విభేదాలకు ముగింపు పలకడం తప్పనిసరనే అభిప్రాయంతో ఢిల్లీ నాయకత్వం నేరుగా జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణలో బీజేపీకి అత్యంత కీలకమైన రాజకీయ వేదికగా గ్రేటర్ హైదరాబాద్‌ను పార్టీ భావిస్తోంది. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సాధించిన కమలం పార్టీ, ఈసారి మరింత బలంగా నిలవాలని వ్యూహరచన చేస్తోంది. అయితే రాష్ట్రంలోని కీలక నాయకుల మధ్య కొనసాగుతున్న విభేదాలు పార్టీ విస్తరణకు అడ్డంకిగా మారుతున్నాయని అధిష్ఠానం గుర్తించినట్లు సమాచారం.

బండి సంజయ్, ఈటల రాజేందర్ అనుచర వర్గాల మధ్య నెలకొన్న రాజకీయ దూరం కింది స్థాయి కార్యకర్తలపై కూడా ప్రభావం చూపిందనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో పరస్పర విమర్శలు చేసుకోవడం పార్టీ ప్రతిష్ఠకు దెబ్బతీస్తోందని ఢిల్లీ పెద్దలు భావించినట్లు తెలుస్తోంది. అందుకే వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కోసం పనిచేయాలని ఇద్దరు నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో బండి సంజయ్‌కు కార్యకర్తలపై గణనీయమైన పట్టు ఉండగా, ఈటల రాజేందర్‌కు కూడా నగర పరిసర ప్రాంతాలు, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ప్రభావం ఉంది. ఈ ఇద్దరి బలాన్ని ఒకే దిశగా వినియోగిస్తే పార్టీకి రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని అధిష్ఠానం అంచనా వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే కార్యకర్తలను కలుపుకొని వెళ్లాలని, స్థానిక స్థాయిలో ఎలాంటి విభేదాలకు తావు ఇవ్వొద్దని నాయకత్వం సూచించినట్లు సమాచారం.

అంతేకాకుండా పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించే నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి కూడా అధిష్ఠానం వెనుకాడదనే సంకేతాలు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ నిర్ణయాలను ధిక్కరించడం, వర్గ రాజకీయాలను ప్రోత్సహించడం, బహిరంగ విమర్శలకు దిగడం వంటి చర్యలను సహించబోమని స్పష్టమైన హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో బండి సంజయ్ అనుసరిస్తున్న దూకుడు రాజకీయ శైలిపై కూడా అధిష్ఠానం సమతుల్య వైఖరి అవలంబించాలని సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వ్యక్తిగత రాజకీయ ఆధిపత్యం కంటే సమష్టి నాయకత్వంతో ముందుకు సాగాలని, ప్రతి కీలక నేతకు సమాన ప్రాధాన్యం కల్పించే విధంగా వ్యవహరించాలని సూచించినట్లు సమాచారం. గ్రేటర్ ఎన్నికల వంటి కీలక సమయంలో నాయకుల మధ్య సమన్వయం దెబ్బతింటే ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూరుతుందనే అంచనాతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ముందుగా పార్టీ అంతర్గత ఐక్యతను బలోపేతం చేయాల్సిందేనని బీజేపీ అధిష్ఠానం నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. బండి సంజయ్, ఈటల రాజేందర్ ఒకే వేదికపై కనిపించడం, పరస్పరం సహకారంతో కార్యక్రమాలు నిర్వహించడం, కార్యకర్తల్లో ఐక్యతను పెంపొందించడం వంటి పరిణామాలు కొనసాగితేనే ఈ సయోధ్య రాజకీయంగా ఫలితాలు ఇస్తుందా లేదా అన్నది స్పష్టమవుతుంది. ప్రస్తుతం మాత్రం గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా కమలం పార్టీ తన అంతర్గత విభేదాలకు తాత్కాలికంగా అయినా తెరదించే ప్రయత్నం ప్రారంభించినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# శేఖర్ సృజన తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి

- శేఖర్ మెమోరియల్ అవార్డుల ప్రదానోత్సవంలో కేటీఆర్
- కళాకారులను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత
- కార్టూనిస్ట్ ఎం. నారు, చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్‌కు అవార్డులు
- వచ్చే ఏడాది నుంచి మరింత ఘనంగా అవార్డుల నిర్వహణకు సహకారం కళా, సాహిత్య రంగాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

**హైదరాబాద్, జూలై 19:**

"తెలంగాణ ఉద్యమ కాలంలో కంబాలపల్లి శేఖర్ గీసిన కార్టూన్లు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి. ఆయన కార్టూన్లు కేవలం వినోదానికి పరిమితం కాకుండా సమాజంలో చైతన్యాన్ని నింపాయి" అని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రముఖ కార్టూనిస్ట్ కంబాలపల్లి శేఖర్ స్మారకార్థం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన శేఖర్ మెమోరియల్ అవార్డ్స్-2026 ప్రదానోత్సవంలో పాల్గొన్న కేటీఆర్, కార్టూన్, చిత్రలేఖన రంగాల్లో విశిష్ట సేవలు అందించిన కళాకారులను సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. కళారంగానికి సేవలందించిన వారిని గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని కేటీఆర్ పేర్కొన్నారు. కళాకారుల ప్రతిభను ప్రోత్సహించే వేదికలు మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక, రాజకీయ అంశాలను తన కలం ద్వారా ప్రజలకు చేరువ చేసిన అరుదైన కళాకారుడిగా కంబాలపల్లి శేఖర్ నిలిచిపోయారని కొనియాడారు. ఉద్యమ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన సృజనాత్మకతకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం. నారుకు, చిత్రలేఖన విభాగంలో కూరెళ్ల శ్రీనివాస్‌కు శేఖర్ మెమోరియల్ అవార్డులను కేటీఆర్ ఇతర అతిథులతో కలిసి ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను అభినందిస్తూ వారి సృజనాత్మక ప్రయాణం మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కళాకారుల సేవలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కళ, సాహిత్యం, కార్టూన్లు సమాజంలో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. కళను ప్రోత్సహించడం ప్రభుత్వాలకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ప్రతిభావంతులైన యువ కళాకారులకు అవకాశాలు కల్పిస్తే సాంస్కృతిక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది నుంచి శేఖర్ మెమోరియల్ అవార్డులను మరింత ఘనంగా నిర్వహించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కంబాలపల్లి శేఖర్ సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ప్రతి ప్రయత్నానికి తన మద్దతు కొనసాగుతుందని తెలిపారు.



# సూపర్ ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

- రైతులు, ప్రజల రక్షణకు మిషన్ మోడ్‌లో పనిచేయాలని మంత్రి తుమ్మల ఆదేశం
- రిజర్వాయర్ల నుంచి సాగునీటి విడుదలకు అనుకూల పరిస్థితులు లేవు
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచన
- తాగునీటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశం
- ప్రతి జిల్లాలో నియంత్రణ కేంద్రాలతో పరిస్థితుల పర్యవేక్షణ

**కరీంనగర్, జూలై 19:**



"సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొని రైతులు, ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలి" అని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల పరిస్థితులపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రస్తుతం రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేసే పరిస్థితి లేదని, భూగర్భ జలాల మట్టం పది మీటర్ల వరకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వరి సాగుపై తొందరపడకుండా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచుతూ ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. కరోనా సమయంలో ప్రభుత్వ యంత్రాంగం ప్రదర్శించిన సమన్వయంతోనే సూపర్ ఎల్‌నినో సవాల్‌ను కూడా అధిగమించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేస్తే ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు

# గుండం జలపాతంలో మరో విషాదం

- హైదరాబాద్ యువకుడు నీటిలో మునిగి మృతి
- స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన యువకుడు
- సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం
- పది రోజుల్లో జలపాతాల్లో రెండో మృతి
- భద్రతా ఏర్పాట్లు పెంచాలని స్థానికుల డిమాండ్

**ములుగు, జూలై 19:**

ములుగు జిల్లాలోని గుండం జలపాతం వద్ద ఆదివారం మరో విషాద ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన అక్తరుద్దీన్ అనే యువకుడు జలపాతంలో మునిగి మృతి చెందాడు. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆయన నీటిలోకి దిగిన సమయంలో ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, జలపాతం లోతును సరిగా అంచనా వేయలేక అక్తరుద్దీన్ నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు, స్థానిక గ్రామస్థులు వెంటనే నీటిలోకి దిగి అతడిని బయటకు తీసుకొచ్చారు. అనంతరం సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గత పది రోజుల వ్యవధిలో ములుగు జిల్లాలోని జలపాతాల్లో ఇద్దరు పర్యాటకులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ జలపాతాల వద్ద తగిన భద్రతా చర్యలు లేకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్చరిక బోర్డులు, రక్షణ సిబ్బంది, అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించడంలో సంబంధిత శాఖలు విఫలమయ్యాయని ఆరోపించారు.



# పదవుల కోసం గాంధీభవన్‌కు రావొద్దు

- సర్ ప్రక్రియపైనే పూర్తిగా దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ ఆదేశం
- ఆగస్టు 3 వరకు నియోజకవర్గాల్లోనే ఉండాలని సూచన
- హైదరాబాద్ చుట్టూ తిరిగితే సహించబోమని హెచ్చరిక
- బూత్ స్థాయి సమీక్షలను వేగవంతం చేయాలని ఆదేశం
- ఉత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీతో భేటీ అవకాశం

**హైదరాబాద్, జూలై 19:**



కాంగ్రెస్ పార్టీ నేతలు పదవులు, నామినేటెడ్ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరగకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై కాంగ్రెస్ ముఖ్య నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పదవుల కోసం వచ్చే వారికి గాంధీభవన్‌లో ఎలాంటి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని పార్టీ నాయకత్వానికి సూచించారు.

నియోజకవర్గాల్లో పని చేయాల్సిన కొందరు నేతలు హైదరాబాద్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. రేపటి నుంచి ఆగస్టు 3 వరకు ఎవరూ గాంధీభవన్‌కు రావద్దని, ఈ వ్యవధిలో ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో సర్ ప్రక్రియపై సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. వెనుకబడిన నియోజకవర్గాల నాయకులు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి సమీక్షలు నిరంతరం కొనసాగాలని, ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు నిర్వర్తించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బూత్ స్థాయి అధికారుల నివేదికలపై మాత్రమే ఆధారపడకుండా పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల నివేదికలను కూడా సమగ్రంగా పరిశీలించాలని సీఎం సూచించారు. కేవలం అధికారుల సమాచారాన్నే నమ్మితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రాబోయే పది రోజుల పాటు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని కాంగ్రెస్ నేతలకు రేవంత్ రెడ్డి ఆదేశించారు. జులై 30న సర్ ప్రక్రియపై మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ ప్రక్రియను సమన్వయం చేయడంలో మరింత బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఆగస్టు 3 వరకు సర్ ప్రక్రియపైనే పూర్తిగా దృష్టి సారించాలని, పైరవీల కోసం గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని సీఎం ప్రకటించారు.





# పుష్కరాల నాటికి భద్రాద్రి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- **అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**
- **ఆలయ అభివృద్ధికి రూ.351 కోట్లతో పనులు**
- **భూసేకరణ కోసం ఇప్పటికే రూ.75 కోట్ల వ్యయం**
- **పుష్కరాలకు 15 రోజుల ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశం**
- **భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచన**

**భద్రాచలం, జూలై 19:**

వచ్చే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ, అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాలు ప్రారంభానికి 15 రోజుల ముందే క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

ఆదివారం భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిని తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆలయ విస్తరణ, పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసిందని, భూసేకరణ కోసం ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.

భద్రాద్రి ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ఎలాంటి భంగం కలగకుండా నిపుణులైన శిల్పులతో అత్యున్నత నాణ్యతా ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పురాతన గోపురాలు, ఆలయ నిర్మాణాల సహజత్వాన్ని కాపాడుతూ ఆగమశాస్త్రాలకు అనుగుణంగా పునరుద్ధరణ పనులు జరగాలని సూచించారు. అవసరమైన చోట అదనపు కార్మికులను నియమించి పనులను వేగవంతం చేయాలని, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు మంత్రి సూచించారు. ప్రతి పది రోజులకోసారి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించాలని, శాఖల మధ్య సమన్వయంతో సాంకేతిక అనుమతులు, ఇతర ప్రక్రియల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త స్నాన ఘట్టాల నిర్మాణం, యాత్రికుల వసతి సదుపాయాల విస్తరణకు కూడా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఆలయ కార్యనిర్వహణాధికారి దామోదరరావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముంచేస్తున్న 'మిల్లింగ్' మాఫియా !

**(తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్) :**

తెలంగాణ రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ (సివిల్ సప్లైస్) కేంద్రంగా సాగుతున్న రైస్ మిల్లర్ల అక్రమాలు, దోపిడీ పర్వం ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కేవలం ఒక జిల్లాకో, ప్రాంతానికో పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోని రైస్ మిల్లర్లు ఒక సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన (సీఎంఆర్) ప్రక్రియలో వేల కోట్ల రూపాయల కుంభకోణం సాగుతోంది.

ప్రభుత్వం ఏటా వేల కోట్ల రూపాయలు వెచ్చించి రైతుల నుంచి మద్దతు ధరతో వడ్లను కొనుగోలు చేస్తుంది. వీటిని భద్రపరిచి, మిల్లింగ్ చేసి బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లర్లకు అప్పగిస్తుంది. నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా మిల్లర్లు ఆ బియ్యాన్ని సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు లేదా ఎఫ్‌సీఐకి అప్పగించాలి. కానీ రాష్ట్రంలోని వందలాది మిల్లుల్లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం నిల్వలు భౌతికంగా కనిపించడం లేదు. కొన్ని మిల్లుల్లో వడ్లను ముందే బహిరంగ మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు తనిఖీల్లో తేలింది. రికార్డుల్లో మాత్రం ధాన్యం ఉన్నట్లు చూపిస్తూ ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు.

**ప్రభుత్వ నిధులతో 'రియల్', 'వ్యాపార' సామ్రాజ్యాలు...**

ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకోగా వచ్చిన సొమ్ము, అలాగే ధాన్యం వేలం (యాక్షన్) ద్వారా దక్కించుకుని ప్రభుత్వానికి చెల్లించకుండా తొక్కిపెట్టిన వందల కోట్ల రూపాయల నిధులను మిల్లర్లు తమ సొంత వ్యాపారాలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో ఈ నిధులతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ల్యాండ్ పూలింగ్, ఫార్మ్‌ల్యాండ్స్ కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. సర్కారు సొమ్ముతో మిల్లర్లు కోటీశ్వరులవుతుంటే, పౌరసరఫరాల సంస్థ మాత్రం వేల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోతోంది.

**తనిఖీల్లో తేలిన దారుణాలు...**

మిల్లర్ల దోపిడీలో అత్యంత దారుణమైన ఘట్టం 'బియ్యం రీసైక్లింగ్'. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి బదులుగా.. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందే పిడికెడు బియ్యాన్ని కిలో రూ.10 నుండి రూ.12 చొప్పున అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ రేషన్ బియ్యాన్నే పాలిష్ పట్టి, కొత్త సంచుల్లో నింపి, తాము మిల్లింగ్ చేసిన సీఎంఆర్ బియ్యంగా ప్రభుత్వానికే తిరిగి అప్పగిస్తున్నారు. దీనివల్ల అసలు ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోతోంది లేదా పక్కదారి పడుతోంది. ఈ విధంగా ఒకే బియ్యాన్ని రెండు, మూడు సార్లు ప్రభుత్వానికే అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఘనాపాటీలు ఈ సిండికేట్ లో ఉన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో సామాన్య రైతుల నుంచి క్వింటాలుకు 3 నుండి 5 కిలోల వరకు అదనంగా వడ్లు లాక్కుంటారు. కానీ మిల్లుకు చేరాక ఆ అదనపు తరుగు మొత్తం మిల్లర్ల జేబుల్లోకి వెళ్తోంది. గోదాముల్లో స్థలం లేదనే సాకుతో ధాన్యం లారీలను రోజుల తరబడి నిలిపివేసి, తెరవెనుక కమీషన్లు కుదిరాకే తూకాలు వేస్తారు. కొన్నిచోట్ల అసలు ధాన్యం రాకముందే వచ్చినట్లు నకిలీ రశీదులు (ట్రక్ షీట్లు) సృష్టించిన ఉదంతాలు కూడా వెలుగులోకి వచ్చాయి. అయితే రాష్ట్రంలోని మెజారిటీ పెద్ద రైస్ మిల్లర్లు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ నేతలు లేదా వారి ప్రధాన అనుచరులు కావడంతో స్థానిక సివిల్ సప్లైస్ అధికారులు వీరి అక్రమాలను ప్రశ్నించే ధైర్యం చేయడం లేదు.



**రూ. 11,000 కోట్ల బకాయిలు.. రికవరీ ఎప్పుడు?**

రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని సీజన్లకు సంబంధించి మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బియ్యం, వేలం బకాయిల విలువ అక్షరాలా రూ.11,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా గడువు ముగిసిందని బియ్యం తీసుకోకపోవడంతో, ఆ భారం మొత్తం రాష్ట్ర ఖజానాపై పడుతోంది. డిఫాల్టర్లుగా మారిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టి, వారి ఆస్తులను అటాచ్ చేయాలని పౌరసమాజం డిమాండ్ చేస్తోంది. రాష్ట్రవ్యాప్త దోపిడీపై ప్రస్తుత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. సివిల్ సప్లైస్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో కూడిన ఐదు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించింది. మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తూ.. నిల్వల్లో తేడాలు ఉంటే అక్కడికక్కడే మిల్లులను సీజ్ చేస్తున్నారు. నోటీసులకు స్పందించని వారిపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం కింద చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో మొత్తం మిల్లులు దాదాపు 3,200 పైనే ఉన్నాయి. అక్రమాల్లో ఉన్నట్లు గుర్తించినవి 450 కంటే ఎక్కువే ఉన్నాయి. లక్షల మెట్రిక్ టన్నులు బకాయి ఉన్న బియ్యం నిల్వలు ఉండగా, రూ.11,000 కోట్లకు పైగా ప్రభుత్వానికి రికవరీ జరగాల్సి ఉంది.

# గోల్కొండలో తొలి బోనంతో బోనాల మహోత్సవాలకు శ్రీకారం

- **నెల రోజుల పాటు వైభవంగా సాగే తెలంగాణ ఆధ్యాత్మిక వేడుకలు**
- **గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం**
- **రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు**
- **బల్కంపేట, సికింద్రాబాద్, లాల్‌దర్వాజాలో తదుపరి ఉత్సవాలు**
- **ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు.. భారీ పోలీసు బందోబస్తు**



**హైదరాబాద్, జూలై 19:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అమావాస్య తర్వాత వచ్చే తొలి ఆదివారం గోల్కొండ అమ్మవారికి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుండగా, ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని భక్తులు ఘనంగా కొనసాగించారు. తొలి బోనంతో నెల రోజుల పాటు సాగే బోనాల ఉత్సవాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. గోల్కొండ కోట పరిసరాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, హారతులు, మొక్కుబడులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ నెల రోజుల బోనాల ఉత్సవాల్లో రెండో ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించనుండగా, అనంతరం మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మూడో ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర జరగనుండగా, నాల్గో ఆదివారం పాతబస్తీలోని లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని అమ్మవారి బోనాలతో ఉత్సవాలు ముగియనున్నాయి. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని ప్రధాన అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం, ఆలయ కమిటీలు తాగునీరు, వైద్య శిబిరాలు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశాయి. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బోనాల వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులు, రంగం కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తెలంగాణ జానపద సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ మహోత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# నన్ను కోస్తావా కోయ్.. కానీ కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయ్

- **రంగనాయకసాగర్ కోసం రైతుల పాదయాత్రలో హరీష్ రావు**
- **"నా రక్తం తీసుకో.. రైతులకు నీళ్లు ఇవ్వు" అంటూ సీఎం రేవంత్‌కు సవాల్**
- **కాళేశ్వరం నుంచి నీటి పంపింగ్ నిలిపివేసి కృత్రిమ కరువు సృష్టించారని ఆరోపణ**
- **రుణమాఫీ, విద్యుత్ సరఫరా, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీత**
- **రైతుల కోసం వెంటనే నీటి విడుదల చేపట్టాలని డిమాండ్**

**సిద్దిపేట, జూలై 19:**

సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ వద్ద రైతులు చేపట్టిన పాదయాత్రలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. రంగనాయకసాగర్‌ను నీటితో నింపాలన్న డిమాండ్‌తో చిన్నకోడూరు రైతులు స్వచ్ఛందంగా ఈ పాదయాత్ర చేపట్టారని, ఇది బీఆర్ఎస్ నిర్వహించిన కార్యక్రమం కాదని ఆయన స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి ప్రకృతి కారణంగా వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ కరువని హరీష్ రావు విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని పంపింగ్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌ను విమర్శిస్తే నీరు రాదని, గోదావరి నుంచి నీటిని ఎత్తిపోస్తేనే రైతుల పొలాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "మా రక్తం తాగితే నీ దాహం తీరుతుందంటే నా రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా. నన్ను కోస్తావా కోయ్.. నేను వస్తా. కానీ కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతులను కాపాడు. నాకు నా రక్తం కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యం" అంటూ సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాలను నింపాలని డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేయకపోవడంతో దిగువ ప్రాంతాలకు భారీగా నీరు వెళ్లిపోతోందని, దీనివల్ల తెలంగాణ రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు.

రుణమాఫీ హామీ అమలు కాలేదని, రైతులకు తగినంత విద్యుత్ సరఫరా కూడా అందడం లేదని హరీష్ రావు విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీటి పంపింగ్ చేయాలని సూచిస్తున్న నిపుణులను బెదిరించడం సరికాదన్నారు. వరద నీటిని సద్వినియోగం చేసుకోకుండా వృథాగా వదిలేస్తున్నారని, ఎల్లంపల్లిలో నీటి కొరత ఏర్పడితే విద్యుత్ ఉత్పత్తి, హైదరాబాద్ తాగునీటి సరఫరాపై కూడా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు ప్రాజెక్టుల్లో ప్రమాదాలు జరిగినా సమగ్ర విచారణ జరగలేదని హరీష్ రావు ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు, ఎస్ఎల్బీసీ, వట్టెం పంప్ హౌస్, సుంకిశాల వంటి ఘటనలపై ఎందుకు విచారణలు జరగడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాత్రమే రాజకీయ కక్షతో విచారణలు జరుపుతున్నారని విమర్శించారు.

ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని, స్కామ్‌ల ప్రభుత్వం పోయి మళ్లీ సంక్షేమ పథకాల పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీష్ రావు అన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం మోటార్లు ప్రారంభించి సాగునీరు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు

# "పీవీ సింధు విజయం దేశానికి గర్వకారణం"

- **జపాన్ ఓపెన్ సూపర్–750 విజేతకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు**
- **తొలి సూపర్–750 టైటిల్ సాధించిన సింధు**
- **భారత క్రీడా రంగానికి మరో గర్వకారణమన్న సీఎం**
- **యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంస**
- **మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, జూలై 19 :**

"జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పీవీ సింధు సాధించిన విజయం దేశానికి గర్వకారణం. అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిని మరింత పెంచిన ఈ ఘనత ప్రతి భారతీయుడికి ఆనందాన్ని కలిగించింది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

జపాన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ముఖ్యమంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తన కెరీర్‌లో తొలి సూపర్-750 టైటిల్‌ను సొంతం చేసుకోవడం విశేషమని పేర్కొన్నారు. అసాధారణ ప్రతిభ, కఠోర శ్రమ, అంకిత భావం, పట్టుదలతో పీవీ సింధు ప్రపంచ స్థాయిలో ఎన్నో విజయాలు సాధించారని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రతి టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ భారత క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.

దేశ యువతకు పీవీ సింధు స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచారని సీఎం పేర్కొన్నారు. క్రీడల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయాలను అందుకుంటూ మరెందరో యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తున్నారని అన్నారు.

భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ వేదికలపై ఇదే జోరు కొనసాగించి మరిన్ని టైటిళ్లు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భారత జెండాను ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరుతూ పీవీ సింధుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె సాధించిన ఈ విజయం భారత బ్యాడ్మింటన్ చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.








# చెన్నూరుపై వివేక్ ఫుల్ ఫోకస్

- వార్డుల్లోకి మంత్రి.. సమస్యలపై నేరుగా ఆరా..
- హాస్టల్ సమస్యలకు తక్షణ పరిష్కార హామీ..
- 100 పడకల ఆసుపత్రి పనులపై మంత్రి సీరియస్..
- ప్రజల్లోకి వెళ్లిన వివేక్..

### చెన్నూరులో ప్రశంసలు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 19 :** చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం చెన్నూరు పట్టణంలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఉదయం నడకలో భాగంగా పలు వార్డుల్లో తిరిగి స్థానికులతో మాట్లాడిన మంత్రి, నల్లగొండ పోచమ్మ వీధిలో ప్రజల తాగునీటి అవసరాల కోసం నూతన బోరుబావిని ప్రారంభించారు. అనంతరం గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. గిరిజన సంక్షేమ వసతి గృహంలో బెంచీలు లేవని విద్యార్థినులు తెలియజేయగా, వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్డెన్లను హెచ్చరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, నాణ్యతతో గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మంత్రి చొరవపై చెన్నూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# బైకును ఢీకొన్న కారు ఒకరు మృతి

**తూప్రాన్ జులై 19 :** తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ చౌరస్తా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తూప్రాన్ మండల్ యావపూర్ గ్రామానికి చెందిన మన్నె నర్సింలు సొంత పని మీద తూప్రాన్ వెళుతుండగా ఎదురుగా వస్తున్న షిఫ్ట్ కారు ఢీకొనగా తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగ తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి నర్సింలు బాడీని తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగిస్తామని ప్రమాదానికి కారణమైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు





# "సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి"

- హనుమాన్ చాలీసా మహాయజ్ఞంలో ఎంపీ ఈటల రాజేందర్
- నాగోల్‌లో మహాయజ్ఞంలో పాల్గొన్న ఎంపీ
- భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించాలని పిలుపు
- ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచన
- ఆలయాల పరిరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 19:** "సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు సమాజమంతా కలిసి కృషి చేయాలి" అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన హనుమాన్ చాలీసా మహాయజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాధువులు, సంతులు, భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా సాధువులు, సంతులు, భక్తులు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ హైందవ ధర్మ పరిరక్షణ కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని ఈటల రాజేందర్ అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ పునరంకిత భావంతో పనిచేయాలని సూచించారు. భారత చరిత్రలో శివాజీ మహారాజ్ సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, సర్వేజనుల సంక్షేమాన్ని ఆకాంక్షించే



గొప్ప సంప్రదాయం భారతీయ ధర్మానిదేనని ఆయన అన్నారు. ప్రపంచానికి ఒకప్పుడు మార్గదర్శకంగా నిలిచిన భారతదేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం భారతీయ సంస్కృతి, ఆలయాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం దేశ చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని అభివర్ణించారు. విధ్వంసానికి గురైన ఆలయాల పునరుద్ధరణతో పాటు భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు ప్రజలు అండగా నిలవాలని ఈటల రాజేందర్ కోరారు. సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై సమాజంలో ధార్మిక విలువలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లో నిర్వహించనున్న హనుమాన్ చాలీసా మహాయజ్ఞ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న నిర్వాహకులను అభినందించిన ఈటల రాజేందర్, కార్యక్రమానికి హాజరైన భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# "అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకూడదు"

- ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశం
- ఆగస్టు 3 వరకు ఎస్ఐఆర్‌పైనే పూర్తి దృష్టి
- బూత్ స్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచన
- నియోజకవర్గాల్లోనే ఉండి ఓటర్లకు సహకరించాలని పిలుపు
- ఎన్నికల ప్రచారం తరహాలో పనిచేయాలని నేతలకు సూచన



**హైదరాబాద్, జూలై 19 :** "అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలి. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టిసారించి అర్హులైన ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులందరూ పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియపైనే దృష్టి కేంద్రీకరించాలని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పనులను వేగవంతం చేసి బూత్ స్థాయి ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల ప్రచార సమయంలో పనిచేసిన అంకితభావంతోనే ఇప్పుడు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో నాయకులు పనిచేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉండి ప్రతి దశను పర్యవేక్షించాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడటం ప్రతి నాయకుడి బాధ్యత అని స్పష్టం చేశారు.

# సింగరేణి చుట్టూ రాజకీయాల వేడి..!

- సింగరేణిపై నేతల క్యూ.. ఉద్యోగాలపై నో క్లారిటీ!..
- పర్యటనలు జోరు.. యువతకు ఉద్యోగాలు ఎప్పుడు?..
- కార్మికుల ప్రేమా.. రాజకీయ ప్రచారమా?..
- హామీలు కాదు.. నియామకాలే కావాలంటున్న యువత..







**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 19:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ పార్టీల దృష్టి ఒక్కసారిగా కేంద్రీకృతమైంది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని పార్టీల నేతలు వరుసపెట్టి సింగరేణి ప్రాంతాల్లో పర్యటిస్తూ కార్మికుల సమస్యలపై స్పందిస్తున్నారు. అయితే, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీ అంశంపై మాత్రం ఏ పార్టీ నుంచీ స్పష్టమైన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక కనిపించడం లేదన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. కేవలం పర్యటనలు, ప్రకటనలు, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మినహా, వాస్తవంగా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదని కార్మిక సంఘాలు, స్థానిక యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

### నేతల పర్యటనల పరంపర..

తొలుత అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, శాసనసభ్యులు సింగరేణి గనులను సందర్శించి, యాజమాన్యం తీరుపై సమీక్షించి ఎలాంటి అవకతవకలు జరగలేదని ప్రకటించారు. కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఆ వెంటనే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధక్షరాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బాయి బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి, సింగరేణి ప్రాంతాల్లో పర్యటించి కార్మిక కుటుంబాలను కలిశారు. వారి సమస్యలను ఆలకించి ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు గుప్పించారు. ఇక భారతీయ జనతా పార్టీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి 'సింగరేణి పోరుబాట పేరుతో కార్మికులను కలిశారు. వారి సమస్యలు తెలుసుకుని, కేంద్ర ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని హామీలు ఇచ్చారు. ఇలా ఒక్కో పార్టీ ఒక్కో పేరుతో సింగరేణి బాట పట్టడంతో, ఈ ప్రాంతం రాజకీయంగా మరింత హాట్‌టాపిక్‌గా మారింది..

### తగ్గుతున్న ఉద్యోగాలు.. పెరుగుతున్న ఆందోళన..

ఒకప్పుడు వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన సింగరేణిలో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. వైద్య మండలి మెడికల్ బోర్డు, ప్రక్రియల పేరుతో చాలామంది కార్మికులు తమ ఉద్యోగాలు కోల్పోతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిటైర్మెంట్లు, మెడికల్ అన్‌ఫిట్ కేసులు, మరణాల కారణంగా ఖాళీ అవుతున్న పోస్టులను భర్తీ చేయడంలో యాజమాన్యం, ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. దీంతో సింగరేణి ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న స్థానిక యువత ఆశలు అడియాశలవుతున్నాయి..

### కార్మికుల్లో అసంతృప్తి.. యువతలో ఆవేదన..

నేతల పర్యటనలు, హామీలు కార్మికులను తాత్కాలికంగా ఊరడించినా, దీర్ఘకాలిక పరిష్కారం లేకపోవడంతో అసంతృప్తి రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రతి పార్టీ నేతలు వచ్చి మా బాధలు తెలుసుకుంటున్నామని చెబుతారు. ఫోటోలు దిగుతారు. కానీ ఖాళీగా ఉన్న పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారో ఎవరూ చెప్పరు" అని స్థానిక యువకులు ప్రశ్నిస్తున్నారు. తండ్రి రిటైరైతే కొడుక్కి ఉద్యోగం వస్తుందని ఆశించిన కుటుంబాలు, మెడికల్ బోర్డు నిబంధనల వల్ల ఆ అవకాశం కోల్పోతున్నామని వాపోతున్నాయి..

### రాజకీయ ప్రచారమా.. సింగరేణి కార్మికులపై చిత్తశుద్ధా?..

రాజకీయ పార్టీల నేతల పర్యటనలు నిజంగా కార్మికుల పట్ల ప్రేమతో చేస్తున్నవా, లేక వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న రాజకీయ ప్రచారమా అన్న చర్చ కూడా స్థానికంగా జోరందుకుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతి పక్షంలో ఉన్నా సింగరేణి కార్మికుల సమస్యలు మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు..

### యువత డిమాండ్.. హామీలు వద్దు, నియామకాలు కావాలి..

పర్యటనలు, ప్రకటనలు, విమర్శలతో కాకుండా వాస్తవంగా ఖాళీ పోస్టులను భర్తీ చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట నిర్ణయాలు తీసుకోవాలని సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు, స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. కేవలం మాటలు, హామీలతో సరిపెట్టకుండా, నిర్దిష్ట గడువుతో నియామక ప్రక్రియను చేపట్టాలని కోరుతున్నారు. రాజకీయ పార్టీలు తమ పర్యటనలను కేవలం ప్రచార అస్త్రంగా వాడుకోకుండా, వాస్తవ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సింగరేణి ప్రాంత ప్రజలు హితవు పలుకుతున్నారు.

## శాకంబరీ దేవిగా అమ్మవారు

**పాపన్నపేట్ జూలై 19 :**



తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన వన దుర్గ మాత ఆలయం వద్ద ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం రోజు శాకంబరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు పంచామృతాలతో కలిగిన అభిషేకం చేసి శాఖంబరి దేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చే విధంగా ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుంటూ ఎంతో మహిమగల అమ్మవారు ఈరోజు శాకంబరీ దేవిగా దర్శనం ఇవ్వడం భక్తులకు సంతోషకరంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ సిబ్బంది మరియు ఈవో వీరేశం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## భూమి మాది... ఉద్యోగం మాకే

**ఝరాసంఘం, జులై 19 :**



తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్), జహీరాబాద్ ప్రాజెక్టులో ఉద్యోగాల నియామకాల్లో స్థానిక యువతకే మొదటి ప్రాధాన్యం కల్పించాలని బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) జిల్లా నాయకులు శ్రావణ్ సింగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేలాది ఎకరాల భూములను స్థానిక రైతులు అభివృద్ధి కోసం త్యాగం చేశారని గుర్తు చేశారు. ఆ భూములపై ఏర్పడుతున్న పరిశ్రమల్లో కానీ ఏ ఇతర కాంట్రాక్టు లలో కానీ ఉద్యోగాలు మాత్రం ఇతర ప్రాంతాల వారికి ఇవ్వడం ఏ మాత్రం సమంజసం కాదని అన్నారు. భూములు కోల్పోయిన కుటుంబాల యువతకు, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వ నైతిక బాధ్యత అని పేర్కొన్నారు.

నిమ్జ్ ప్రాజెక్ట్ లక్ష్యం కేవలం పరిశ్రమల ఏర్పాటు మాత్రమే కాదని, స్థానిక యువతకు ఉపాధి, ప్రాంతీయ అభివృద్ధి, ఆర్థిక పురోగతిని సాధించడమేనని అన్నారు. కానీ స్థానికుల ప్రయోజనాలు పక్కనపెట్టి బాహ్య ప్రాంతాల వారికి ఉద్యోగాలు కల్పిస్తే ప్రాజెక్ట్ అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిమ్జ్‌లో ఏర్పాటు కానున్న ప్రతి పరిశ్రమ స్థానిక యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి, నియామకాల్లో వారికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అలాగే భూములు కోల్పోయిన కుటుంబాల్లో కనీసం ఒక్కరికైనా శాశ్వత ఉద్యోగం కల్పించేలా ప్రత్యేక విధానం రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం, నిమ్జ్ అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు కలిసి స్థానికుల ఉద్యోగ హక్కులను కాపాడాలని, నియామకాలపై పారదర్శక విధానాన్ని ప్రకటించాలని ఆయన కోరారు. స్థానికుల హక్కులను విస్మరిస్తే బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## రహదారులకు నిధులు కేటాయించాలి

- **మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి**

**పాపన్నపేట జూలై 19 :**

మండలంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాపన్నపేట నుంచి పెద్దశంకరంపేట వరకు మల్లంపేట, చికోడు గ్రామాల మీదుగా వెళ్లే సుమారు 16 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారిని వెడల్పు చేసి బలోపేతం చేయడానికి రూ.45 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ రహదారి అభివృద్ధి చెందితే మండల ప్రజలకు, రైతులకు, వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. పాపన్నపేట మండలంలోని నార్సింగి నుంచి కొడపాక వరకు సుమారు 9 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి కోసం రూ.23 కోట్లు మంజూరు చేయాలని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.ఈ రెండు రహదారులు ప్రజలకు అత్యంత కీలకమైనవని, వీటి అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



## శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రపురం, జూలై 19:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ ఎంఐజీ కాలనీలోని శ్రీ రామాలయంలో ఆదివారం నిర్వహించిన 3వ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతీ నగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. రథయాత్రలో ప్రజాప్రతినిధులు భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐకృత, సోదరభావం, భక్తి భావాలను పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందిస్తూ, ప్రజలందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని దైవానుగ్రహాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్, రఘునాథ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతిభతో మెరిసిన గొల్లపల్లికి చెందిన శ్రావిణ్య

- **గ్రాడ్యుయేషన్‌లో టాప్-10లో నిలిచిన శ్రావీణ్యకు అరుదైన గౌరవం**
- **అత్యంత ప్రతిష్టాత్మకమైన 'డీన్స్ లిస్ట్' లో కూడా చోటు లభించింది**

**కొండాపూర్ జులై 19:**




కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రావీణ్య తన ప్రతిభతో గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. గ్రామానికి చెందిన అనిత-బాలరాజ్ గౌడ్ దంపతుల కుమార్తె అయిన శ్రావీణ్య, ప్రముఖ వోక్సెన్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి విశిష్ట ప్రతిభ కనబరిచారు.యూనివర్సిటీ నిర్వహించిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాప్ 10 విద్యార్థుల జాబితాలో స్థానం సంపాదించారు. అంతేకాకుండా విద్యార్థుల విద్యా ప్రతిభ, క్రమశిక్షణ, అత్యుత్తమ అకాడమిక్ ఫలితాలను గుర్తిస్తూ అందించే *ప్రతిష్టాత్మక 'డీన్స్ లిస్ట్'*లో కూడా ఆమెకు చోటు దక్కడం విశేషం.కొండాపూర్ మండలానికి చెందిన విద్యార్థిని ఈ స్థాయిలో గుర్తింపు పొందడం ఇదే తొలిసారి కావడంతో గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రావీణ్య సాధించిన ఈ విజయం గ్రామ యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా శ్రావీణ్యను ఆమె తల్లిదండ్రులు అనిత, బాలరాజ్ గౌడ్ అభినందిస్తూ, చిన్ననాటి నుంచే చదువుపై చూపిన ఆసక్తి, కృషి, పట్టుదల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా శ్రావీణ్య మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి ప్రతి అడుగులోనూ అండగా నిలిచిన నా తల్లిదండ్రుల ప్రోత్సాహమే నా విజయానికి కారణం. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని వారి ఆశయాలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తాను. సమాజానికి ఉపయోగపడే విధంగా నా విద్యను వినియోగించుకుంటాను" అని తెలిపారు.




## కార్మికుల హక్కుల సాధనకు ఐక్యతే బలం: కాట శ్రీనివాస్ గౌడ్

**రామచంద్రపురం, జూలై 19 :**

కార్మికులు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సమర్థంగా సాధించుకోవడంతో పాటు సంక్షేమాన్ని పరిరక్షించుకోగలరని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో కోకాకోలా కంపెనీ కార్మికులతో సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న ట్రేడ్ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థలోని ప్రస్తుత పరిస్థితులు, యూనియన్ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్మికుల మధ్య ఐక్యత, సంఘటిత భావం ఉంటేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని, వారి ప్రయోజనాలను కాపాడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో కోకాకోలా కంపెనీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక ట్రాక్టర్లు సీజ్

**పాపన్నపేట్ జూలై 19 :**



మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం సిబ్బందితో కలిసి వెళ్లి చూడగా ఇసుక లోడ్ కలిగిన 3ట్రాక్టర్లు, ఇసుక తరలించేందుకు ప్రయత్నించిన మరో 6ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ట్రాక్టర్ లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.మండలంలో మంజీరా నది, చెరువుల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## పోలీస్ అకాడమీలో పోకిరి

- **ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసు**
- **తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో కేసు నమోదు**
- **ప్రైవేట్ వీడియోలతో బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు**
- **లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, ఐటీ చట్టం కింద కేసు**
- **ఘటనపై గోప్యంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**హైదరాబాద్, జూలై 19 :**

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం కలకలం రేపింది. తనతో పాటు శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత అధికారిణి ఫిర్యాదు ప్రకారం, నిందితుడు తనను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడడమే కాకుండా, తన వ్యక్తిగత వీడియోలను అనుమతి లేకుండా చిత్రీకరించాడని ఆరోపించారు. అనంతరం ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తానని బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆ వ్యక్తిగత వీడియోలను తన భర్తకు కూడా పంపించి మానసికంగా వేధింపులకు గురిచేశాడని ఫిర్యాదులో వెల్లడించారు. బాధితురాలి లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, సమాచార సాంకేతిక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రతిష్టాత్మక పోలీస్ అకాడమీలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ తదుపరి చర్యలు కొనసాగిస్తున్నారు.

## పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు ముఖ్యం

- **సీసీ కెమెరాలు ఏర్పాటుతో దర్యాప్తులో వేగవంతం**

**నర్సాపూర్ జూలై 19 :**

పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, ఛేదన, ప్రజల భద్రత , ట్రాఫిక్ నియంత్రణను వంటి అంశాలపై సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత వంటి అంశాలపై ఆదివారం మున్సిపాలిటి కౌన్సిలర్లతో ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, విద్యాసంస్థలు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల గుర్తింపు, దర్యాప్తులో కీలక ఆధారాల సేకరణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, అలాగే ప్రజల్లో భద్రతా భావం పెంపొందుతుందని వివరించారు నర్సాపూర్ నిర్మాణంలో అభివృద్ధి లో వార్డు ప్రజా ప్రతినిధి, ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని అన్నారు.



## ఓల్డ్ ఎంఐజీ కాలనీలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం..

- **ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి..**

**రామచంద్రపురం, జూలై 19 :**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలోని బీ పార్క్ ప్రాంగణంలో బీహెచ్ఈఎల్ ఎంఐజీ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో, యశోదా హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని భారతి నగర్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో యశోదా హాస్పిటల్‌కు చెందిన ఆర్థోపెడిక్ నిపుణులు డా. కీర్తి, డా. నిఖిల్ కాలనీ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలపై వైద్య సలహాలు అందించారు. అవసరమైన వారికి తదుపరి చికిత్సపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి నివాస ప్రాంతంలోనే ఉచితంగా అందించడం అభినందనీయమైన కార్యక్రమమన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ ఎంఐజీ కాలనీ అధ్యక్షుడు రాజు, డైరెక్టర్ రాధాకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాణి యాదవ్, సంపత్ గౌడ్, రాకేష్, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# ఇలా చేస్తే దంతాలు మెరవాల్సిందే!



ఒక మనిషిలో ఎదుటు వారిని ఎక్కువగా ఆకట్టుకునేది అందం... ఎంత గొప్పగా తయారైనా అందంగా కనిపించాలంటే మన నవ్వు కచ్చితంగా బాగుండాలి. చక్కని నవ్వు అందాన్ని పెంచుతుంది. నవ్వు అందంగా కనిపించాలంటే ఇక దంతాలూ అందంగా ఉండాల్సిందే. కానీ కొంతమందికి కొన్ని కారణాల వల్ల దంతాలపై మరకలు పడుతుంటాయి. వాటిని దూరం చేసుకోవాలంటే ఏం చేయాలో తెలుసుకోండి. ఈ చిట్కాలు గనక పాటిస్తే మీ దంతాలు తలతల మెరవడం గ్యారంటీ!

## వీటితో పళ్లు తోమితే మరకలు మాయం..

దంతాలు అందంగా కనిపించాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. వీటిని పాటిస్తే పళ్లు తెల్లగా మారి అందంగా కనిపిస్తాయి. వీటితో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయి.అందుకే బద్ధకాన్ని వదిలి కనీసం రోజుకి రెండు సార్లు పళ్లు తోముకోవాలి. రాత్రి భోజనం తర్వాత కచ్చితంగా బ్రష్ చేయాలి. ఆయిల్ పుల్లింగ్, మౌత్ వాష్‌తో పుక్కిలించడం వల్ల దంతాలను ఎక్కువ కాలం తెల్లగా ఉంచుకోవచ్చు. అదే విధంగా పళ్లపై ఉన్న మరకలు పోవాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

### వైట్ వెనిగర్..

వైట్ వెనిగర్‌లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దంతాల మీద మరకలు, మురికి, గోధుమ రంగు మచ్చల్ని దూరం చేస్తాయి. అలాగే వెనిగర్‌లోని ఎసిటిక్ యాసిడ్ పంటి ఎనామిల్‌ని రక్షిస్తుంది.

**తయారీ విధానం....**

అరకప్పు నీటిలో 2 చెంచాలా వెనిగర్, 1 చెంచా ఉప్పు కలపాలి. ఆ నీటితో రోజుకి రెండు సార్లు పుక్కిలిస్తే దంతాలు, నోటిలోని క్రిములు, మరకల్ని దూరం చేయొచ్చు.





### జామతో..

జామ పండు, దాని ఆకులు సహజంగా దంతాలపై మరకలని తొలగిస్తుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు చిగుళ్ల వాపు, దంతాల ఇన్ఫెక్షన్‌స్‌ని తగ్గించి దంతాలకు రక్షణని అందిస్తాయి. రోజూ రెండు జామ ఆకులను తీసుకొని శుభ్రం చేసి నమిలి ఉమ్మివేయాలి. ఇది దంతాలపై ఏర్పడే మరకల్ని దూరం చేస్తుంది. అదే విధంగా జామ కాయపై ఉప్పు చల్లి రోజుకి ఒకటి రెండు సార్లు నమిలి రసాన్ని మింగితే పంటి నొప్పి, సమస్యలు తగ్గుతాయి.

### కలబంద గుజ్జు..

కలబంద గుజ్జు దంతాలపై మరకల్ని దూరం చేస్తుంది. కలబంద గుజ్జులో కొన్ని పదార్థాలను కలిపి రుద్దితే మరకలు కొద్ది రోజుల్లోనే మాయమవుతాయి.

**తయారీ విధానం....**

పావు కప్పు నీటిలో 2 చెంచాల కలబంద గుజ్జు, 4 చెంచాలా గ్లిజరిన్, 4 చెంచాలా బేకింగ్ సోడా, 1 చెక్క నిమ్మరసం కలపాలి. దీంతో రోజూ దంతాలపై రుద్ది నీటితో పుక్కిలిస్తే పళ్లపై ఉన్న మరకలు పోతాయి.



### నారింజ తొక్క..

దంతాలపై తీవ్రమైన మరకలు దూరం చేసేందుకు నారింజ తొక్కను చాలా బాగా ఉపయోగపడుతుంది. తాజా నారింజ తొక్కతో దంతాలపై రుద్దితే మరకలు పోతాయి. తాజా నారింజ తొక్కల్ని గ్రైండ్ చేసి ఆ స్క్రబ్‌ని దంతాలపై రుద్దితే మరకలు క్రమక్రమంగా దూరమవుతాయి.



### బేకింగ్ సోడా..

బేకింగ్ సోడా వాడితే దంతాల మరకలు తొలగించేందుకు దోహదపడుతుంది. ఇందు కోసం టూత్‌పేస్టులో ఓ స్పూన్ బేకింగ్ సోడా, కొద్దిగా ఉప్పు కలిపి దంతాల మీద రుద్దడం వల్ల దంతాల మరకలు దూరమవుతాయి. ఈ బేకింగ్ సోడా మిశ్రమంతో పళ్లని తోముకొని ఆపై గోరువెచ్చని నీటితో పుక్కిలించాలి.



# మునగాకు ప్రయోజనాలు తెలిస్తే వదలరు!



సాంబారులో మునక్కాయలంటే అందరికీ ఇష్టమే... కానీ మునగాకు కూర ఎంతమంది తింటుంటారు? ఒకప్పుడు మన పెద్దలు రకరకాలుగా మునగాకును ఆహారంలో భాగం చేసుకున్నారు. పప్పుల్లో, కూరగా, వేపుడుగా చాలా రకాలుగా తినేవారు. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మనకు ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన చెట్లలో మునగ చెట్టు ఒకటి. మునగ కాయలతో పాటు, ఆకుల్లోనూ అద్భుతమైన ఆరోగ్య ఔషధాలు ఉన్నాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. మునగాకు ఎన్నో ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి ఇవి దివ్య ఔషధంలా పని చేస్తుందని ఆయుర్వేదం చెబుతోంది.

### ఔషధ గుణాలు పుష్కలం...

ఆయుర్వేదంలో మునగాకుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. దీనిని అమృతంలా పరిగణిస్తారు. ఎందుకంటే మునగాకుకు వందలాది జబ్బులను నయం చేసే శక్తి ఉంది. దీని ఆకులు, కాడలను కూరగాయలుగా ఉపయోగిస్తారు. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న మునగ.. రక్తంలో షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి.

### పోషకాల గని....

ఎన్‌సీబీఐ నివేదిక ప్రకారం.. మునగ ఆకుల్లో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, విటమిన్‌ఎ, సి, బి కాంప్లెక్స్, బీటాకెరోటిన్, అమైనో యాసిడ్స్, ఫినోలిక్‌లతో పాటు, 40 కంటే ఎక్కువ రకాల యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి.

### ఇతర ఆహారపదార్థాలతో పోలిస్తే:

- క్యారెట్లు తినడం ద్వారా వచ్చే విటమిన్ ఎ 10 రెట్లు అధికంగా మునగాకు ద్వారా పొందొచ్చు.
- నిమ్మకాయలో ఉండే దాని కంటే 5 రెట్లు ఎక్కువ విటమిన్ సి కలిగి ఉంటుంది.
- పాల నుంచి లభించే క్యాల్షియం కన్నా.. మునగాకు నుంచి 17 రెట్లు అధికంగా లభిస్తుంది.
- పెరుగు తినడం వల్ల లభించే ప్రొటీన్ల కన్నా.. మునగాకు నుంచి 8 రెట్లు అధికంగా పొందవచ్చు.
- అరటిపండ్ల నుంచి పొందే పొటాషియం కన్నా.. ఎండిన మునగాకులో 15 రెట్లు అధికంగా ఉంటుంది.

### మునగాకు తినడం వల్ల ప్రయోజనాలు:




- మునగ ఆకులు విటమిన్ Cని కలిగి ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.
- మునగాకులోని ఔషధ గుణాలు జుట్టు రాలడం, ఉబ్బసం, కీళ్లనొప్పులు వంటి సాధారణ వ్యాధులకు చికిత్స చేయడంలో ఉపయోగపడతాయి.
- ఈ ఆకులు ఊబకాయం, బరువు తగ్గడంలో కూడా సహాయపడతాయి.
- డయాబెటిస్‌తో బాధపడేవారికి కూడా ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.
- పరిగడుపున ఈ ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్ కంట్రోల్ అవుతుంది.
- మునగ ఆకులు ఎముకలకు అవసరమైన కాల్షియం, మెగ్నీషియం అందిస్తాయి.
- ప్రతిరోజు మునగాకుల రసాన్ని తాగడం వల్ల శరీరంలోని హానికరమైన బ్యాక్టీరియా మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది.
- మునగ ఆకులను తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, అల్సర్ వంటి అనేక కడుపు సంబంధిత సమస్యలను నయం చేయవచ్చు.
- ఇందులో ఉండే పీచు, జీర్ణవ్యవస్థతో పాటు పొట్టను ఆరోగ్యంగా ఉంచి, ఆరోగ్యకరమైన ప్రేగు కదలికకు కూడా దోహదపడుతుంది.



| వంద గ్రాముల మునగాకులో ఉండే పోషకాలు |
|---|
| నీరు: 75.9 శాతం |
| పిండి పదార్థాలు: 13.4 గ్రా |
| కొవ్వులు: 17 గ్రా |
| మాంసకృత్తులు: 6.7 గ్రా |
| కాల్షియం: 440 మిల్లీగ్రా |
| పాస్పరస్: 70 మిల్లీగ్రా |
| ఐరన్: 7 మిల్లీగ్రా |
| విటమిన్ సి: 200 మిల్లీగ్రా |
| ఖనిజ లవణాలు: 2.3 శాతం |
| పీచు పదార్థం: 0.9 మిల్లీగ్రా |
| శక్తి: 97 కేలరీలు |

## పీవీ సింధు చారిత్రక టైటిల్ విజయం... అభినందించిన చంద్రబాబు, నారా లోకేశ్



- జపాన్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న పీవీ సింధు
- ఫైనల్లో యమగుచిపై 21-17, 21-17 తేడాతో గెలుపు
- ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు
- సింధుకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సాధించిన చారిత్రక విజయంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. జపాన్ ఓపెన్ గెలిచిన సింధుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న సింధుకు ఈ గెలుపు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని, ఇది భారత బ్యాడ్మింటన్‌లో ఒక చారిత్రక మైలురాయి అని చంద్రబాబు కొనియాడారు. సింధు చరిత్ర సృష్టించిందని, ఆమెను ఆపలేమని మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

టోక్యోలో ఆదివారం జరిగిన జపాన్ ఓపెన్ సూపర్750 టోర్నీ ఫైనల్లో సింధు అద్భుత ప్రదర్శన కనబరిచింది. జపాన్‌కు చెందిన క్రీడాకారిణి, నాలుగుసార్లు ఈ టోర్నీ విజేత అయిన అకానే యమగుచిపై 21 17, 2117 తేడాతో వరుస గేముల్లో ఘన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సింధు తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

ఈ విజయంతో సింధు అరుదైన రికార్డు సృష్టించింది. జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారత క్రీడాకారిణిగా ఆమె చరిత్రకెక్కింది. అంతేకాకుండా, గత ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న కీలక టైటిల్‌ను సింధు కైవసం చేసుకోవడం ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. ప్రత్యర్థి యమగుచిని ఆమె సొంతగడ్డపై ఓడించి టైటిల్ గెలవడం ఈ విజయం ప్రాధాన్యతను మరింత పెంచింది.

## చిన్న దేశాలు కూడా ఫిఫా వరల్డ్ కప్ లో ఆడుతున్నాయి... మరి మనం ఎక్కడ?



- భారత్ వరల్డ్ కప్‌కు అర్హత సాధించడం రాకెట్ సైన్స్ కాదన్న ఏఐఎఫ్ఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి
- కఠోర శ్రమ, ఐక్యత, పారదర్శక పాలనతోనే లక్ష్యం సాధ్యమని స్పష్టం
- గ్రాస్‌రూట్స్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు సమూల మార్పులు అవసరమని వెల్లడి
- ప్రభుత్వ మద్దతు సాధించడం భారత ఫుట్‌బాల్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్య
- IANS వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షాజీ ప్రభాకరన్ వ్యాఖ్యలు

**స్పోర్ట్స్ డెస్క్ :**

ప్రపంచమంతా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ ఫీవర్‌లో మునిగిపోయింది. అర్జెంటీనా, స్పెయిన్ మధ్య జరిగే తుదిపోరు కోసం క్రీడాభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో, 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత్ ఎందుకు ఈ మెగా టోర్నీకి అర్హత సాధించలేకపోతోంది? అనే ప్రశ్న మరోసారి చర్చనీయాంశమైంది. అయితే, ఈ లక్ష్యం సాధించడం అసాధ్యమేమీ కాదని, అదొక "రాకెట్ సైన్స్" అంతకన్నా కాదని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (AIFF) మాజీ ప్రధాన కార్యదర్శి షాజీ ప్రభాకరన్ స్పష్టం చేశారు.

ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత్ వరల్డ్ కప్‌కు ఎందుకు అర్హత సాధించలేదని ప్రశ్నించడం బాధాకరం. నిజం చెప్పాలంటే, మనం తగినంతగా కష్టపడటం లేదు. మన దగ్గర వనరులు, ప్రతిభ, అభిరుచి అన్నీ ఉన్నాయి. కానీ, అద్భుతాలు జరిగిపోవు. నిరంతర కఠోర శ్రమ, ఐక్యత, పారదర్శక పాలన, సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుంది" అని ఆయన వివరించారు.

గ్రాస్‌రూట్స్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అన్ని విభాగాల్లో మార్పులు రావాలని ప్రభాకరన్ నొక్కిచెప్పారు. "కేప్ వెర్డే వంటి చిన్న దేశాలు కూడా పట్టుదలతో అద్భుతాలు చేస్తున్నాయి. వారి నుంచి మనం స్ఫూర్తి పొందాలి. భారత ప్రభుత్వం క్రీడలకు మద్దతిస్తోంది. ఇప్పుడు ఫుట్‌బాల్ పెద్దలు సరైన నిర్ణయాలు తీసుకుని, అందరినీ ఏకతాటి పైకి తీసుకురావాలి" అని అన్నారు. సరైన ప్రణాళిక, ప్రభుత్వ మద్దతు, కార్పొరేట్ భాగస్వామ్యంతో పనిచేస్తే 1015 ఏళ్లలో భారత్ వరల్డ్ కప్‌లో ఆడటం సాధ్యమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్‌ను దేశానికి ఒక 'సాఫ్ట్ పవర్'గా మార్చవచ్చని, తద్వారా ప్రపంచ వేదికపై మన సంస్కృతిని ప్రదర్శించవచ్చని అభిప్రాయపడ్డారు. తన జీవితకాలంలో భారత్ ప్రపంచకప్‌లో ఆడటాన్ని చూడాలన్నదే తన అతిపెద్ద కల అని ఆయన స్పష్టం చేశారు.

# లార్డ్స్ లో ఇంగ్లండ్ బ్యాటర్ల విశ్వరూపం... 388 పరుగులు కొడితేనే మనవాళ్లకు విజయం!

- మూడో వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్
- నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లకు 387 పరుగుల భారీ స్కోరు
- ఓపెనర్ బెన్ డకెట్ (141) అద్భుత శతకంతో చెలరేగాడు
- జో రూట్ (74*), జాస్ బట్లర్ (41*) ఆఖర్లో విధ్వంసం
- సిరీస్ విజయం కోసం టీమిండియా ముందు 388 పరుగుల కఠిన లక్ష్యం

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో చివరిదైన మూడో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు బ్యాటింగ్ విశ్వరూపం ప్రదర్శించింది. చారిత్రక లార్డ్స్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్, నిర్ణీత 50 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికి 387 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఓపెనర్ బెన్ డకెట్ (141) బాదిన అద్భుత శతకానికి, చివర్లో జో రూట్ (74*), జాస్ బట్లర్ (41*) ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్‌లు తోడవడంతో ఇంగ్లండ్ పరుగుల వరద పారించింది. ఈ సిరీస్‌ను కైవసం చేసుకోవాలంటే భారత్ ఈ కొండంత లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది.

**తొలి వికెట్ కు 192**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు ఓపెనర్లు బెన్ డకెట్, జాకబ్ బెథెల్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ క్రీజులో పాతుకుపోయారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 30.1 ఓవర్లలో 192 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియాను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. దూకుడుగా ఆడిన బెథెల్ 93 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 91 పరుగులు చేసి శతకాన్ని తృటిలో చేజార్చుకున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి అతను వెనుదిరిగాడు.

**డకెట్ శతకం, బట్లర్ విధ్వంసం**

బెథెల్ ఔటైనా, మరో ఓపెనర్ బెన్ డకెట్ తన జోరును కొనసాగించాడు. సంయమనంతో ఆడుతూనే చెత్త బంతులను బౌండరీకి తరలిస్తూ భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ క్రమంలో తన వన్డే కెరీర్‌లో ఓ అద్భుతమైన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తం 135 బంతులు ఎదుర్కొన్న డకెట్, 18 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 141 పరుగులు చేసి ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. డకెట్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. 14 పరుగులే చేసి ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.



అనంతరం జో రూట్‌కు, విధ్వంసకర బ్యాటర్ జాస్ బట్లర్ జత కలిశాడు. బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో 41 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని స్ట్రైక్ రేట్ 315.38గా ఉందంటే విధ్వంసం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు జో రూట్ కూడా 48 బంతుల్లో 9 ఫోర్లతో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ ఆఖరి 19 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు జోడించి స్కోరును 380 పరుగులు దాటించారు.

**చేతులెత్తేసిన భారత బౌలర్లు**

ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. ప్రసిద్ధ్ కృష్ణ 10 ఓవర్లలో 69 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి కాస్త ఫర్వాలేదనిపించాడు. ప్రిన్స్ యాదవ్ ఒక వికెట్ తీసినా, 79 పరుగులు సమర్పించుకున్నాడు. గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో ఏకంగా 97 పరుగులు ఇచ్చి చెత్త బౌలింగ్ ప్రదర్శన నమోదు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ 72 పరుగులు ఇవ్వగా, అక్షర్ పటేల్ (61) కూడా అదే బాటలో నడిచాడు. భారత బౌలర్లు ఏకంగా 16 వైడ్లు వేయడం వారిపై ఉన్న ఒత్తిడిని స్పష్టం చేస్తోంది. ఈ భారీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటింగ్ లైనప్ ఎలా రాణిస్తుందో వేచి చూడాలి.

# చివరి వన్డే: ఎవరు గెలిస్తే వారిదే సిరీస్... టీమిండియాపై టాస్ నెగ్గిన ఇంగ్లండ్

- ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్
- గాయం కారణంగా కీలక పేసర్ జస్ప్రీత్ బుమ్రా జట్టుకు దూరం
- భారత జట్టులోకి కేఎల్ రాహుల్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్
- సిరీస్ విజేతను తేల్చే ఆఖరి మ్యాచ్ లార్డ్స్ వేదికగా ప్రారంభం


**స్పోర్ట్స్ డెస్క్ :**

లండన్‌లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న సిరీస్ విజేతను తేల్చే మూడో, ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ 3 మ్యాచ్ ల సిరీస్ లో ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలవడంతో నేటి పోరు ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు బుమ్రా ఎడమ మోకాలికి గాయమైందని, వాపు కారణంగా అతడు మూడో వన్డేకు అందుబాటులో లేడని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బుమ్రాతో పాటు వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబేలను కూడా తుది జట్టు నుంచి తప్పించారు. వారి స్థానాల్లో కేఎల్ రాహుల్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చారు. ఇంగ్లండ్ జట్టులో సాకిబ్ మహమూద్ స్థానంలో జోష్ టంగ్‌కు అవకాశం కల్పించారు.

టాస్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, "మేము ముందుగా బౌలింగ్ చేయాలనే అనుకున్నాం. ఈ పిచ్‌పై నలుగురు పేసర్లతో ఆడాలనుకున్నాం. గత మ్యాచ్‌లో మంచి స్థితిలో ఉండి కూడా మధ్య ఓవర్లలో వికెట్లు కోల్పోయాం. ఈసారి ఆ పొరపాటు జరగకుండా చూసుకుని, 280300 పరుగులు లక్ష్యంగా పెట్టుకుంటాం" అని తెలిపాడు.

ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ స్పందిస్తూ, "పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపిస్తోంది. మంచి స్కోరు సాధించి భారత్‌పై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాం. ఈ మ్యాచ్ గెలిచి ట్రోఫీని సొంతం చేసుకుంటామని ఆశిస్తున్నాం" అని ధీమా వ్యక్తం చేశాడు.

అన్నింటికీ మించి, ఈ మ్యాచ్ లో అందరి దృష్టి టీమిండియా 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మపైనే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవల ఫామ్ కోల్పోవడంతో జట్టులో రోహిత్ శర్మ స్థానం ప్రశ్నార్థకమైంది. దాంతో, నేటి లార్డ్స్ వన్డేనే రోహిత్ శర్మ కెరీర్ లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ అంటూ ప్రచారం జరిగింది. ఇక రిటైర్ అవ్వాల్సిన సమయం వచ్చిందంటూ సెలెక్టర్లు అతడికి సందేశం ఇచ్చారని వార్తలు వచ్చాయి. అయితే, అలాంటిదేమీ లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టత ఇచ్చాయి. ఈ నేపథ్యంలో, రోహిత్ శర్మ ఇవాళ్టి మ్యాచ్ లో ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారింది.



**రెండు జట్ల వివరాలు**

భారత్: రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.

ఇంగ్లండ్: బెన్ డకెట్, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), సామ్ కరన్, విల్ జాక్స్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# రూట్ వర్సెస్ బుమ్రా: లార్డ్స్‌లో మన పేసర్‌కే కలిసొస్తుందన్న నాయర్!

- బుమ్రాపై రూట్ వ్యూహాన్ని ప్రశంసించిన నాయర్
- బుమ్రా బౌలింగ్‌లో లోపం లేదని వ్యాఖ్య
- లార్డ్స్ స్లోప్‌తో భారత్‌కు ఆశలు
- చిన్న లక్ష్యం రూట్‌కు కలిసి వచ్చిందని విశ్లేషణ
- రూట్‌ను ఔట్ చేసే వ్యూహంపై చర్చ
- జట్టులో మార్పులపై నాయర్ సూచనలు





**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత్, ఇంగ్లండ్ మధ్య సిరీస్‌ను నిర్ణయించే మూడో వన్డేకు ముందు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మధ్య పోరుపై మాజీ భారత సహాయ కోచ్ అభిషేక్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పటివరకు ఈ పోరులో రూట్ పైచేయి సాధించినా.. బుమ్రా బౌలింగ్‌లో ఎలాంటి లోపం లేదని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్ మైదాన పరిస్థితులు ఈసారి భారత పేసర్‌కు అనుకూలించే అవకాశం ఉందని చెప్పాడు.

జియోహాట్‌స్టార్‌తో మాట్లాడుతూ నాయర్.. బుమ్రా తన బౌలింగ్‌లో మార్చాల్సిన అవసరం ఏమీ లేదన్నాడు. సరైన లైన్, లెంగ్త్‌లోనే బంతులు వేస్తున్నాడని, అవుట్‌స్వింగర్లతో రూట్‌ను నిరంతరం పరీక్షిస్తున్నాడని పేర్కొన్నాడు. అయితే బుమ్రాపై ఎలా ఆడాలో రూట్‌కు స్పష్టమైన అవగాహన ఉందని కొనియాడాడు. ఏ బంతిని ఎదుర్కోవాలి, ఎప్పుడు రిస్క్ తీసుకోవాలి అనే విషయంలో అతను ఎంతో తెలివిగా వ్యవహరిస్తున్నాడని చెప్పాడు.

రెండో వన్డేలో లక్ష్యం కేవలం 234 పరుగులే కావడం కూడా రూట్‌కు కలిసి వచ్చిందని నాయర్ విశ్లేషించాడు. చిన్న లక్ష్యాన్ని ఛేదించే సమయంలో ప్రత్యర్థి అత్యుత్తమ బౌలర్‌పై అనవసరంగా దాడి చేయాల్సిన అవసరం ఉండదన్నాడు. అదే లక్ష్యం 250, 300 లేదా 350 పరుగులుగా ఉంటే బుమ్రాకు వికెట్ తీసే అవకాశాలు మరింత పెరిగేవని అభిప్రాయపడ్డాడు.

లార్డ్స్ మైదానంలోని ప్రత్యేక స్లోప్ బుమ్రాకు ఈ మ్యాచ్‌లో ఉపయోగపడొచ్చని నాయర్ చెప్పాడు. అదే జరిగితే బంతి లోపలకు రావడంతో రూట్‌ను ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుందన్నాడు. రెండో వన్డేలో రూట్ 99 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలవడం కూడా ఆసక్తికరంగా అనిపించిందని పేర్కొన్నాడు. వరుసగా ఐదు ఇన్నింగ్స్‌ల్లో 50కి పైగా పరుగులు చేయడం గొప్ప విజయమని ప్రశంసించాడు.

మూడో వన్డేకు ముందు భారత జట్టు వ్యూహంలో రూట్‌ను ఎలా ఔట్ చేయాలన్న అంశంపైనే ఎక్కువ చర్చ జరిగే అవకాశం ఉందని నాయర్ అంచనా వేశాడు. లార్డ్స్ పరిస్థితులను బట్టి జట్టు కూర్పులో మార్పులు ఉండొచ్చన్నాడు. కుల్దీప్ యాదవ్‌ను మళ్లీ తీసుకొస్తారా? లేక అదనపు స్పెషలిస్ట్ పేసర్‌తో బరిలోకి దిగుతారా? అనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని చెప్పాడు. ఇంగ్లండ్ రెండో వన్డేలో నలుగురు ప్రధాన పేసర్లతో విజయం సాధించిన విషయాన్ని భారత్ కూడా పరిశీలించవచ్చని సూచించాడు.

# ఆమె నవ్వితే అందం... నవ్వకపోతే రౌద్రం



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వారణాసి'. ఈ సినిమాలో మహేశ్ సరసన బాలీవుడ్ కథానాయిక ప్రియాంక చోప్రా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె మందాకిని పాత్రలో తెరపై కనిపించనుంది. శనివారం ప్రియాంక పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని ప్రియాంకకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పంచుకున్నారు. 'ఆమె నవ్వినప్పుడు అందం.. నవ్వకపోతే రౌద్రం' అనే క్యాప్షన్‌ను జోడించారు. ప్రియాంక కొన్ని నెలలు నుంచి ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. మహేశ్ ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడి పాత్రల్లో ద్విపాత్రాభినయం చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చితాన్ని కె.ఎల్.నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మిస్తున్నారు.

# పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశమే

ఓ నాయికగా గ్లామర్ కంటే కథకు, వైవిధ్యమైన పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చే తక్కువమంది నాయికల్లో యామీ గౌతమ్ ఒకరు. నాయికా ప్రాధాన్య చిత్రాల్లో సత్తా చాటే ఈ తార 'ఆర్టికల్ 370'లో పోషించిన ఇంటెలిజెన్స్ అధికారిణి జూనీ హక్సర్ పాత్రతో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ పాత్రే ఆమెని జాతీయ ఉత్తమ నటిగా నిలబెట్టింది. జమ్మూకశ్మీర్‌లోని ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో ఇంటెలిజెన్స్ అధికారిణిగా దేశభక్తిని చాటుతూ.. భావోద్వేగమైన సందర్భాలలో కూడా పాత్రలో గంభీరతని ప్రదర్శించి, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. నిశ్శబ్ద సన్నివేశాల్లో కళ్లతోనే కట్టిపడేశారామె. 'నేను ఎంచుకునే సినిమాలు ప్రస్తుత సంఘటనలతో ముడిపడి ఉంటున్నాయేమో అందుకే సామాజిక మాధ్యమాల్లో నన్ను విమర్శిస్తున్నారు'అని చెప్పే యామీ ఇటీవలే 'హక్' చిత్రంలో షాజియా పాత్రలో కనిపించి తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఆమె ఎక్కువగా సీరియస్ పాత్రల్నే పోషిస్తుందని అనుకుంటున్న సమయంలో 'బాల' చిత్రంతో నవ్వులు పూయించిన నాయిక ఈమె. పాత్ర ఏదైనా కానీ అందులోకి పరకాయ ప్రవేశం చేయడమే యామికి తెలుసంటూ అందరిచేత ప్రశంసలు అందుకునే ఈ నాయిక ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉంది.



# ఇదంతా అభిమానుల చలవే..



72వ జాతీయ పురస్కారాలు(72nd National Film Awards) ధనుష్‌కు రెండింతల ఆనందాన్ని తీసుకొచ్చాయి. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'రాయన్'(Raayan) ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (తమిళ) ఎంపికవడంతో పాటు.. 'కెప్టెన్ మిల్లర్'(Captain Miller)తో ధనుష్ స్పెషల్ మెన్షన్ (నటుడు) గౌరవాన్ని పొందిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా జాతీయ స్థాయిలో తొలిసారి అవార్డును సొంతం చేసుకోవడం, నటుడిగా నాలుగోసారి జ్యూరీ గుర్తింపును పొందడంపై ధనుష్ (Dhanush) ఆనందం వ్యక్తం చేశారు. ఎంపిక కమిటీకి, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టా పోస్టులో తన భావాలను ఇలా పంచుకున్నారు.

"ఓం నమశ్శివాయ..! జాతీయ పురస్కారాల్లో 'రాయన్' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడంతో పాటు, 'కెప్టెన్ మిల్లర్'తో స్పెషల్ మెన్షన్(నటుడు) గుర్తింపు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సందర్భంగా జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీకి, ఎంపిక కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కెరీర్ తొలినాళ్ల నుంచి మద్దతుగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు. నటుడిగా ఇది నాకు నాలుగో జాతీయ అవార్డు కాగా, దర్శకుడిగా మొట్టమొదటిది. నాకు ఇంత శక్తినిచ్చి, నా ఎదుగుదలకు మూలస్తంభాలుగా నిలిచిన నా అభిమానులే లేకపోతే ఇవేవీ సాధ్యమయ్యేవి కావు. అందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను"

# అప్పుడు సినిమాలపై ఉత్సాహం కోల్పోయా

'సఖి', 'రంగ్ దే బసంతి', 'త్రీ ఇడియట్స్' లాంటి అద్భుతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ ( Madhavan). అయితే, తన కెరీర్‌లో 40 ఏళ్ల వయసులో సినిమాలపై తాను ఆసక్తి కోల్పోయానని ఆయన తాజాగా వెల్లడించారు. తనలో వచ్చిన ఈ మార్పును తనకంటే ముందే భార్య సరిత గుర్తించిందని తెలిపారు.

"నా జీవితంలో అదొక భిన్నమైన దశ. అప్పుడు నేను చేసిన సినిమాలన్నీ కేవలం సాధారణ విజయాలనే సాధించాయి. వాటిలో గొప్పగా చెప్పుకొనే ప్రశంసలు గానీ, కెరీర్‌లో పెద్ద కుదుపులు గానీ లేవు. ఉదయాన్నే నిద్రలేచి కథల గురించి ఆలోచించడం, ఎప్పుడెప్పుడు సెట్స్‌కి వెళ్లాలా అనే ఉత్సాహం నాలో అప్పట్లో లేదు. కొత్త కథల గురించి ఆలోచించడం కూడా మానేశా. నాలో వచ్చిన ఈ మార్పును నాకంటే ముందుగా నా భార్య సరితే గుర్తించింది " అని మాధవన్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రస్తుతం ఆయన కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జి.డి.నాయుడు' (G D Naidu)లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.





# సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్లను బ్లేమ్ చేయడం కరెక్ట్ కాదు

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. అయితే ఆమె నటించిన సినిమాలన్నీ బాక్సాఫీసు వద్ద హిట్ అందుకోలేనప్పటికీ అమ్మడు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఇటీవల ఆమె నటించిన 'లెనిన్' మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కెరీర్ ప్రారంభించిన తర్వాత తన ఖాతాలో మొదటి విజయం పడటంతో ఫుల్ ఖుషీలో ఉన్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇండస్ట్రీలో పాల్గొన్న భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్లపై వేసే ఐరన్ లెగ్ ముద్రపై చాలా ఘాటుగా స్పందించారు. కెరీర్ మొదట్లో తనపై వచ్చిన విమర్శల గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. నన్ను ఐరన్ లెగ్ అనడం నన్ను బాధించిందని నేను చెప్పను కానీ, నన్ను తీవ్ర గందరగోళానికి గురిచేసింది. ఎందుకంటే ఆ మాటల్లో నాకు ఎలాంటి అర్థం కనిపించలేదు. ఆ తర్వాత ఇండస్ట్రీలోని కొందరు వ్యక్తుల ద్వారా.. ఈ పరిస్థితి కేవలం నా ఒక్కదానికే ఎదురుకాలేదని, ఇక్కడ చాలా మంది హీరోయిన్లు ఇలాంటి ఫేజ్ దాటి వచ్చారని తెలిసింది.

స్వయంగా స్టార్ హీరోయిన్ తాప్సీ పన్నునాతో మాట్లాడుతూ.. కెరీర్ ప్రారంభంలో తనను కూడా ఐరన్ లెగ్ అని పిలిచేవారని చెప్పింది. శృతి హాసన్, శ్రీలీల లాంటి టాప్ హీరోయిన్ల విషయంలోనూ ఇదే జరిగిందని తెలుసుకున్నానని భాగ్యశ్రీ చెప్పుకొచ్చారు. అప్పట్లో తనకు ఇండస్ట్రీ విషయాలు తెలియవు కాబట్టే ఆ విమర్శలు వింతగా అనిపించేవని చెప్పారు. సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్లదే తప్పు అనడం కరెక్ట్ కాదని అన్నారు. "సినిమా ఎడిటింగ్ చేసేటప్పుడు హీరోయిన్లు అక్కడ ఉండరు. కథ మార్చడంలో కానీ, సీన్లు తీసేయడంలో కానీ వాళ్లకు ఎలాంటి సంబంధం ఉండదు. అలాంటప్పుడు మూవీ ఆడకపోతే హీరోయిన్లని ఎలా తప్పుపడతారు? అసలు ఏ నటుడినైనా సినిమా ఫ్లాప్‌కు ఎలా బాధ్యుడిని చేస్తారు? అని ప్రశ్నించారు. తన దృష్టిలో మూవీ అనేది ఒక క్రికెట్ టీమ్ లాంటిదని.. టీమ్ మొత్తం స్కోర్ చేయలేక ఓడిపోతే.. దానికి కేవలం ఒక్కరినే బ్లేమ్ చేయడం కరెక్ట్ కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

# 'అమరన్'కు మూడు అవార్డులు

ఉగ్రదాడిలో అమరుడైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన యాక్షన్ చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కథానాయకుడు శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించింది. 72వ జాతీయ పురస్కారాల్లో ఈ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా పెరియసామి, ఉత్తమ సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాశ్ కుమార్, ఉత్తమ ఎడిటర్‌గా ఆర్ కలైవానన్ పురస్కారాలు దక్కించుకున్నారు. ఈ సినిమా కథ, నాయకానాయికల నటన, భావోద్వేగాల పరంగా ప్రేక్షకుల నుంచి ప్రత్యేక ఆదరణ పొందింది. దర్శకుడు ఈ చిత్రాన్ని ఓ అందమైన ప్రేమకథగా తీర్చిదిద్దారు. ఇందులో మేజర్ ముకుంద్ అతని భార్య ఇందుల మధ్య ప్రేమకథ, కశ్మీర్‌లో జరిగిన ఒక భయంకరమైన ఉగ్రవాద ఆపరేషన్‌లో అతను చేసిన అంతిమ త్యాగం భావోద్వేగభరితంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం సినీప్రియుల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా చేసింది. దర్శకుడు ఈ చిత్రంలో ఎక్కువగా ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాల్ని రూపొందించారు. కలైవానన్ అద్భుతమైన ఎడిటింగ్ కూడా ఈ చిత్రం విజయంలో కీలకంగా నిలిచింది.



# రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా ఆ పని చేయను..



కోలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి ఇటీవల 'గట్ట కుస్తీ 2' సినిమాతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న ఐశ్వర్య ఒక ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేశారు. సినిమా కలెక్షన్ల నంబర్ల కంటే థియేటర్లలో జనాలు నవ్వుతుంటే చూడటమే తనకు నిజమైన సంతోషాన్ని ఇచ్చిందని ఐశ్వర్య లక్ష్మి చెప్పారు. కామెడీ చేయడం తనకు కొత్త అని, ఇందులో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. ఇక సోషల్ మీడియాకు దూరం కావడంపై ఐశ్వర్య మాట్లాడుతూ.. నెటిజన్ల ట్రోలింగ్, బాడీ షేమింగ్, ఫొటోలను మార్ఫింగ్ చేయడం వంటి కారణాల వల్ల తాను సోషల్ మీడియా అకౌంట్‌ను డిలీట్ చేసినట్లు చెప్పారు. అక్కడ తనకు ఎప్పుడూ రక్షణ ఉన్నట్లు అనిపించలేదని, నెగిటివ్ కామెంట్స్ వల్ల మనుషులతో మాట్లాడాలన్నా భయం వేసేదని అన్నారు.

ఇప్పుడు సోషల్ మీడియా లేకపోవడం వల్లే ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నానని.. ఎవరైనా రోజుకు రూ. 100 కోట్లు ఇస్తానన్నా మళ్లీ సోషల్ మీడియాలోకి రానని తేల్చి చెప్పారు. తన తదుపరి సినిమాల గురించి చెబుతూ.. ఐశ్వర్య ఆనంద్ దర్శకత్వంలో 1996 బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఒక తమిళ సినిమాలో లేడీ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. ఇది రెగ్యులర్ మాస్ సినిమా కాదని, చాలా విభిన్నంగా ఉంటుందని అన్నారు. అలాగే మలయాళంలో 'ఆశ' అనే సినిమాతో పాటు 'తీవినై పోట్రు', '#లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నట్లు చెప్పారు. అన్నిటికంటే ముఖ్యంగా తన బాలీవుడ్ ఎంట్రీ సినిమా పాత్ర చాలా అద్భుతంగా కుదిరిందని, ఆ క్యారెక్టర్ చేయడానికి తాను నిజంగా అర్హురాలినా అనే అనుమానం కూడా వచ్చిందని.. హిందీ ప్రేక్షకులు తన నటనను ఆదరిస్తారని ఆశిస్తున్నట్లు ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చారు.ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. అమ్మడు షాకింగ్ నిర్ణయంపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com